క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం ప్రత్యేక పూజలు జరిపించుకున్న రవీంద్రనాథ్‌కు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందచేయగా, అధికారులు ప్రసాదాలు అందించారు.

నేటి నుంచి దర్గా ఉరుసు



భవానీపురం(విజయవాడ పశ్చిమ):స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్తి ఔలియా దర్గా 39వ ఉరుసు (గంధం) మహోత్సవం ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ, దర్గా ముతవల్లి/అధ్యక్షుడు సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పర్చంఖుషాయ్ (ఉరుసు ప్రారంభోత్సవం) జరుగుతుందని పేర్కొన్నారు. రెండవ రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు బాబా దర్గా నుంచి గంధంతో వాహనంలో ఊరేగింపుగా బయలుదేరి ప్రకాశం బ్యారేజి, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా వించిపేటలో బాబా దేవుని ధ్యానం చేసిన ప్రదేశానికి (రైల్వే స్టేషన్ పడమర వైపు గల షాజహూర్ ముసాఫిర్ ఖానాలోని షాప్ నెంబర్ 9) వద్దకు చేరుకుంటుందని వివరించారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు భవానీపురం బాబా దర్గాకు చేరుకుంటుందని తెలిపారు. అనంతరం సంధల్(గంధం)ను బాబా దర్బార్‌పైకి ఎక్కిస్తామని పేర్కొన్నారు. చివరి రోజు ఆదివారం చిరాగ (దీపారాధన), సాయంత్రం 6.45 గంటలకు ఫాతెహాఖానీ జరుగుతుందని అన్నారు. రాత్రి 9 గంటలకు బాబాను కీర్తిస్తూ భక్తి గీతాలతో కూడిన ఖవ్వాలీ ప్రోగ్రామ్ ఉంటుందన్నారు.

క్రీడలతో అత్యుత్తమ భవిష్యత్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):క్రీడలతో అత్యుత్తమ భవిష్యత్ సొంతమవుతుందని కొత్తపేట హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు 2023-24 రాష్ట్ర స్థాయి బహుమతిని సాధించిన కొత్తపేట హిందూ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం ఆ పాఠశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గోళ్ల బాబా విజయకుమార్ మాట్లాడుతూ ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ సుమారు 120 సంవత్సరాలుగా విద్యారంగ వ్యాప్తికి పాటుపడుతుందన్నారు. కమిటీ ప్రథమ కార్యదర్శి కేఎల్వీ మోహనరావు మాట్లాడుతూ 26 జిల్లాలలో వేలాది పాఠశాలలు ఉండగా హిందూ హైస్కూల్ క్రీడల్లో పురస్కారాన్ని పొందటం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.అనసూయని కమిటీ ప్రతినిధులు సత్కరించారు. పురస్కారాన్ని అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయులు సత్యప్రసాద్, లక్ష్మీలను కమిటీ ప్రముఖులు సత్కరించారు. కేబీఎస్ కార్యదర్శి వి.నారాయణరావు, ఎంఎస్ఆర్ పాఠశాల అధ్యక్షులు మద్ది సుబ్బారావు, కోశాధికారి కొత్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేనత్త, మేనకోడలిపై చాకుతో దాడి

చిట్టినగర్(విజయవాడ,పశ్చిమ):పాత గొడవల నేపథ్యంలో మేనత్త, మేనకోడలిపై చాకుతో దాడి చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వించిపేట మహాలక్ష్మి గుడి ప్రాంతానికి చెందిన ముత్యాల లక్ష్మికి మేనల్లుడైన దూండీ కిరణ్, గంగాధర్‌తో గొడవలున్నాయి. మద్యం తాగిన దూండీ కిరణ్ మేనత్త లక్ష్మి ఇంటికి వెళ్లి నోటికి వచ్చినట్లు తిట్టసాగాడు. లక్ష్మి కుమార్తె శారద వచ్చి కిరణ్‌కు సర్ది చెప్పగా ఇంటికి వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత దూండీ కిరణ్, గంగాధర్‌లు చాకు తీసుకుని మేనత్త ఇంటికి వచ్చారు. మళ్లీ గొడవ ప్రారంభం కావడంతో గంగాధర్‌కు శారద అడ్డు రావడంతో అతని చేతిలో ఉన్న చాకు మెడపై గాయమైంది. ఈ క్రమంలో లక్ష్మి గంగాధర్ చేతిలోని చాకును లాక్కునేందుకు ప్రయత్నించగా, లక్ష్మి బుగ్గపై గాయమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గాయపడిన బాధితులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు వైష్ణవాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలునికి ప్రత్యేక అలంకరణ గావించారు. వైఖానాసాగమానుసారం చాలా వైష్ణవాలయాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న శ్రీ కృష్ణభగవానునికి స్వర్ణకిరీట ధారణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలతో సుమారు రూ.18 లక్షల వ్యయంతో స్వర్ణకిరీటాన్ని తయారు చేసి స్వామి వారికి ధరింపజేశారు. స్వామి వారి జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి ఉదయం తిరుమంజన అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తులసీదళార్చన చేశారు. సాయంత్రం సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమాన్ని అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉదయం చిన్నికృష్ణుని ఉత్సవమూర్తికి విశేష తిరుమంజన నిర్వహించారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి స్వామి వారికి తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షిత్, ముకుంద తదితరులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్నవేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి పలు విశేష అర్చనలు నిర్వహించారు.



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారుల సందడి



కృష్ణుడు, గోపికల వేషధారణలో మానసిక దివ్యాంగులు

మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం చేశారు.ఉభయదేవరులతో కూడిన స్వామి వార్లకు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని కోదండరామాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానుడికి విశేష తిరుమంజనాన్ని నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న ఉత్సవమూర్తులకు పంచామృతాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు తదితరులు నిర్వహించారు. శేషయ్యవీధిలోని పాండురంగస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు అద్దేపలి మురళీకృష్ణ నిర్వహించారు.

కృష్ణుడి గీతా సారం..మనవాళి మనుగడకు దిశా నిర్దేశం
-ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీకృష్ణుడు అర్జునుడికి ప్రబోధించిన గీతా సారం మానవాళి మనుగడకు దిశా నిర్దేశమని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విద్యాధరపురం కబేళా రోడ్‌లోగల రాము క్వారీ సెంటర్‌లో గోకుల సేవా సమితి, రాము క్వారీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పీతల నాగు, శ్రీదేవి నేతృత్వంలో నిర్వహించిన వేడుకలలో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఆవాల హనుమంతరావు, పానుగంటి వేణుగోపాల్ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మహాభారత యుద్ధంలో కౌరవుల వైపు మహామహులు ఉన్నప్పటికి వారు అధర్మం పక్షాన ఉండటంతో అపజయం పొందారని గుర్తు చేశారు. నేటి ప్రజాస్వామ్యంలోకూడా ధర్మం పక్షాన నిలబడితేనే విజయం లభిస్తుందన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎదుట వారికి ఉపకారం చేయకపోయినా అపకారం చేయకుండా ఉండటమే ధర్మాన్ని పరిరక్షించడమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, బాపతి కోటిరెడ్డి, సంగీత-నృత్య అకాడమి డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి, సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, బట్టిపాటి శివ, బోర మల్లేశ్వరరెడ్డి, బైపినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, దావాల బుజ్జి, జె శ్రీనివాసరావు, డబ్బాడ రాము, ఐతా కృష్ణకిషోర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా స్థానిక ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. సెంటర్‌లోని ఫిజికల్లీ ఛాలెంజ్డ్ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో చూపరులను అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జె సునీత మాట్లాడుతూ మానసికంగా బలహీనంగా ఉండే విద్యార్థులతో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మానసికంగా బలహీనంగా ఉండే పిల్లలను సాధారణ పిల్లలుగా తీర్చిదిద్ది అందరు పిల్లల మాదిరిగానే సమాజంలో గుర్తింపు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్‌లో అనుభవంగల ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ, ఆక్యుపేషన్ థెరఫీ టీచర్స్‌తో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సెంటర్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని కూరపాటి హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ కృష్ణుడి జన్మాష్టమి వేడుకలను గురువాం వైభవంగా నిర్వహించారు. ఈ పండుగ వేడుకల్లో శ్రీ కృష్ణుడు, గోపికలతో పాటు వివిధ రకాల వేషధారణలతో బాలబాలికలు అలరించారు. శ్రీ కృష్ణునిపై భక్తితో, దాండియ, కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొని భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల పోటీలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధరాచార్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తగుళ్లు కోదండరామాలయంలో శ్రీకృష్ణుని మూర్తికి విశేష పూజలు



కొత్తపేటలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ప్రత్యేక అలంకారం



స్వర్ణ కిరీటంతో దర్శనమిస్తున్న శ్రీకృష్ణ ప్రార్థన మందిరంలోని శ్రీకృష్ణభగవానుడు



శేషయ్యవీధిలోని విశేష అలంకారంలో రుక్మాబాయి సమేత పాండురంగడు



బ్రాహ్మణవీధి వెంకన్న సన్నిధిలో బాలకృష్ణునికి ప్రత్యేక అలంకారం

అభివృద్ధి పనుల పరిశీలన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్, కరెంట్ ఆఫీసు రోడ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయా డివిజన్లలో ఆయన పర్యటించారు. కొత్తగా డివిజన్లలో చేపట్టాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర రాఘవ, కార్పొరేటర్లు అంజనేయ రెడ్డి, పి.చైతన్య రెడ్డి, బి.కోటిరెడ్డి, ఎం.మాధురి లావణ్య, నాయకులు మైలవరపు కృష్ణ, నాయకులు కార్యకర్తలు నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి వసుధారాణి అభినందనీయురాలు
– జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు భాషా, సాహిత్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్న రచయిత్రి రూపెనగుంట్ల వసుధారాణి అభినందనీయురాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వసుధారాణిని కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వేటపాలేనికి చెందిన వసుధరాణి రచించిన కేవలం నువ్వే, దేవ కాంచనం నీడన, పది వెంట నేను అనే పుస్తకాలు ప్రముఖంగా నిలిచాయన్నారు. తెలుగు భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

9న ఎన్వీ రావుకు సత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):దేశంలోని రైతులపై పీహెడీ చేసిన బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎన్వీ రావును 9వ తేదీన ఘనంగా సత్కరించనున్నామని పలువురు బీసీ నేతలు పేర్కొన్నారు. కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్కార విశేషాలను బీసీ నేతలు వివరించారు. బీసీ నాయకులు నమ్మి అప్పారావు, నగరాల సంఘం ప్రతినిధి బాయన శేఖర్‌బాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి శివకుమార్ పట్నాయక్‌లు మాట్లాడుతూ బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎన్వీరావు నాగార్జున యూనివర్సిటీలో రైతుల గురించి పీహెడీ చేయడంతో ఆయన డాక్టరేట్ అందచేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్వీ రావును బీసీ సంఘాల తరుపున ఘనంగా సత్కరిస్తున్నామన్నారు. 9వ తేదీ కేటీ రోడ్డులోని ఎన్వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేయనున్నారన్నారు. బీసీ నేతలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులందరూ విచ్చేయాలని కోరారు.

మురుగునీటి పారుదల సక్రమంగా సాగాలి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):డ్రెయిన్స్‌లో మురుగునీటి పారుదల, పారిశుద్ధ్య నిర్వహణపై పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులతో కలిసి గురువారం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, జోజినగర్‌లోని కరెంట్ ఆఫీస్ రోడ్లలో విస్తృతంగా పర్యటించారు. ఆయా రోడ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజి, తాగునీటి సరఫరా విధానం, ప్రధాన, అంతర్గత రోడ్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానం, సైడ్ డ్రెయిన్స్‌లో మురుగునీటి పారుదలను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమన్వయంతో పని చేసి రోడ్లపై నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, మైలవరపు మాధురి లావణ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, కె రోశిరెడ్డి, మల్లెల శ్రీనివాసరెడ్డి, డీవీ రెడ్డి, బడేమియా, ఈఈ నారాయణమూర్తి, ఏఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్స్ పరిశీలిస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రకృతి పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌స్ విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మజీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా 'స్వచ్ఛమైన గాలి కోసం అందరం' అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మజీరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసేకుంటున్న సాంకేతిక ప్రగతి పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రకృతిలో కీలకమైన గాలి నాణ్యత రోజురోజుకు దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం పెరుగుతుండటంతో మానవుల ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కేవలం మానవులకే కాకుండా సమస్త జీవరాశి గాలికాలుష్యంతో ప్రమాదంలో పడిందన్నారు. వాయు కాలుష్యాన్ని వీలైనంత వరకూ తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న పరిస్థితులను విద్యార్థులు గమనిస్తూ ప్రకృతిలో జరిగే కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ రీజనల్ ఆఫీసర్ ఎస్. విజయసారథి మాట్లాడుతూ విద్యార్థులు కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ముఖ్యంగా కాలుష్య నివారణకు సంబంధించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలన్నారు. డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి సీహెచ్ నాగభూషణం, అధ్యాపకులు ఆర్.ఉదయ్‌కుమార్, ఏహెచ్‌డీ ప్రకాష్, జి.హేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బ్రహ్మజీరావు

అలరించిన సినీ, భక్తి సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: శ్రీసాయిలాహరి లాహిరిలో సరిగమల సప్త స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సీనియర్ గాయకుడు కేవీ రమణబాబు ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ, భక్తి సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు రసూల్‌బాబు, ఆదిరాల జయప్రభ, కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివ నాగలక్ష్మి,పావని, పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. శ్రీసాయి లాహిరి, లాహిరిలో సరిగమల సప్తస్వరాలు సంస్థ వ్యవస్థాపకుడు కేవీ రమణబాబు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ అధ్యాపకులు నరసింహారావుకు సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ):ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్న జి.నరసింహారావుకు విద్యాధరపురం కబేళా వద్దగల ఉర్దూ ప్రభుత్వ కళాశాలలో గురువారం అభినందన సత్కారం చేశారు. ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, సిబ్బంది కలిసి నరసింహారావుకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందిన నరసింహారావు అభినందనీయులన్నారు. రెండు దశాబ్దాలుగా అధ్యాపకుడిగా పని చేస్తూ ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. గౌరవ ప్రదమైన అధ్యాపక వృత్తిలో ఉంటూ అంకిత భావం, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడమే నరసింహారావు ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందడానికి నిదర్శనమని తెలిపారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో గురువుల పాత్ర కీలకమని అన్నారు.

ముగిసిన ఎల్ఐసీ వారోత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిసాయి. బెంజిసర్కిల్ సమీపంలోని ఎల్ఐసీ బ్రాంచి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాలసీదారుల సమావేశం, పాలసీదారుల సర్వీసు క్యాంపు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, హైస్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యాలయ సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జి.కృపాచారి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సి. రామకృష్ణ మాట్లాడారు.

యోగాసన పోటీల్లో జ్యోత్స్నదేవి ప్రతిభ

మొగల్రాజపురం:కృష్ణాజిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన యోగాసన పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న గంటా జోత్స్నదేవి ప్రతిభ చూపి మహిళల విభాగంలో కృష్ణా జిల్లా (ఉమ్మడి కృష్ణా జిల్లా) స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అన్నారు. జోత్స్నదేవిని గురువారం కళాశాలలో అభినందించారు.

దుర్గగుడిపై యాగశాలకు శంకుస్థాపన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో నూతన యాగశాల, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు పనులకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ శంకుస్థాపన చేసి, పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దంపతులు హాజరయ్యారు. అంతకు ముందు చైర్మన్, ఈవోలతో పాటు పాలక మండలి సభ్యులు మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం చేపట్టిన పనులు దిగ్విజయంగా పూర్తి కావాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో డీఈవో గురు ప్రసాద్, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, చింతా సింహచలం, బచ్చు మాధవీకృష్ణ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమతో పాటు యాగశాల నిర్మాణదాత నరసింహారావు, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దాతల నిర్మాణ సహకారంతో ఆయా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

దసరా అలంకారాలపై చైర్మన్‌తో చర్చ

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి చేసే విశేష అలంకారాలపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్యాలు గురువారం చైర్మన్ కర్నాటి రాంబాబు చర్చించారు. ఈ ఏడాది అధిక శ్రావణం, తిథుల హెచ్చుతగ్గుల కారణంగా అలంకరణలలో చోటు చేసుకున్న మార్పుల గురించి చర్చించారు. సుమారు అరగంటకు పైగా సాగిన ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో తొలి రోజున స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారం చేయకపోవడానికి గల కారణాలను వైదిక కమిటీ, ఈవోలను చైర్మన్ రాంబాబు అడిగి తెలుసుకున్నారు.



యాగశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ



ధ్వజస్తంభ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్, ఈవోలతో పాటు దేవినేని అవినాష్ దంపతులు